సాక్షి పెద్దపల్లి

మంగళవారం ౹ 10 ౹ సెప్టెంబర్ ౹ 2024



తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

రామగుండం: పెద్దపల్లి ఆర్డీవో గంగారాం సోమవారం అంతర్గాం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.



క్యాంటీన్‌లో భోజన సౌకర్యం

గోదావరిఖని: జీడీకే-5 ఓసీపీ క్యాంటీన్‌లో తొలిసారి ఉద్యోగుల కోసం భోజన సౌకర్యం కల్పించారు. సింగరేణి ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ సోమవారం భోజ న సౌకర్యాన్ని ప్రారంభించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0/24.0

ఆకాశం మేఘావృతమవుతుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. జిల్లాలోని పలుచోట్ల చెదురుముదురు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రక్షణ పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న కార్పొరేట్ సేఫ్టీ జీఎం శ్రీనివాస్

గోదావరిఖని: రక్షణను పాఠంలా కాకుండా ఒక సంస్కృతిగా అలవర్చుకోవాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం శ్రీనివాస్ సూచించారు. స్థానిక ఇల్లెందు క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి నుంచి రవాణా వరకు ప్రమాదాల్లేని సింగరేణిగా తీర్చిదిద్దేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్రమాదాలు జరిగిన తర్వాత విచారణ, జాగ్రత్తలు చేపట్టే కన్నా ముందే జాగ్రత్త పడాలని అన్నారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఏరియాల వారీగా గనుల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలు, ఇప్పటివరకు గనుల వారీగా జరిగిన ప్రమాదాలకు గల కారణాలను ఆయన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో రామగుండం, కొత్తగూడెం, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎంలు కేహెచ్ఎన్ గుప్తా, కేజీ తివారీ, కె.రఘుకుమార్, ఏరియాల సేఫ్టీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో వివిధ దశల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు ఆసక్తి, అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి సోమవారం తెలిపారు. ఈనెల 5 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారు ఆప్షన్ ఎంచుకుని ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని ఆయన సూచించారు. కొత్త దరఖాస్తుదారులు అప్లికేషన్ ఫారం, ఒరిజినల్ సర్టిఫికెట్లులతో ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు ప్రతీరోజు ఉదయం 11గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

జూలపల్లి(పెద్దపల్లి): స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి సోమవారం తెలిపారు. పదో తరగతి చదివే బొంగాని నవ్య, గుంటి అనూష, మల్లారపు శృతి గోదావరిఖనిలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబర్చారన్నారు. ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్మల్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వారిని హెచ్‌ఎం సరస్వతితో పాటు ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

లోకో పైలెట్లకు పురస్కారాలు



ప్రశంసాపత్రాలు అందిస్తున్న భరతేష్‌కుమార్‌జైన్

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్‌లోని లోకో పైలెట్లు సీహెచ్ రవి, దాసరి కిరణ్‌కుమార్‌కు సోమవారం దక్షిణ మధ్య రైల్వే సురక్ష పురస్కారాలను అధికారులు ప్రదానం చేశారు. సేఫ్టీ విభాగంలో వారు చూపిన ప్రతిభ ఆధారంగా దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) భరతేష్‌కుమార్‌జైన్ చేతుల మీదుగా కేంద్ర కార్యాలయంలో పురస్కార పత్రంతోపాటు జ్ఞాపిక అందుకున్నారు.

అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే విజయ్



పెద్దపల్లిరూరల్: శాసనసభ, శాసనమండలి ఆర్థిక సంఘం కమిటీలను సోమవారం ప్రభుత్వం ఖరారు చేసింది. అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా అరికపూడి గాంధీని నియమించింది. అంచనాల కమిటీ చైర్మన్‌గా ఎస్.పద్మావతిరెడ్డిని ఖరారు చేస్తూ స్పీకర్ ఉత్తర్వులు జారీచేశారు. అసెంబ్లీ అంచనాల కమిటీలో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుకు చోటుదక్కింది. ఆయనతోపాటు మరో 11 మందిని సభ్యులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యుడిగా రాజ్‌ఠాకూర్



గోదావరిఖని: పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యుడిగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను సోమవారం నియమించారు. ప్రభుత్వం ప్రకటించిన కమిటీ జాబితాలో రామగుండం ప్రాంతానికి ప్రాతినిధ్యం కల్పించారు. కమిటీలో మక్కాన్‌సింగ్‌కు స్థానం కల్పించడంపై నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'నామినేటెడ్'పై ఆశలు

> కోటి ఆశలతో మార్కెట్లకు పంట ఉత్పత్తులను తీసుకొచ్చే అన్నదాతకు న్యాయం చేసేలా.. పాలకవర్గాలు జవాబుదారీతనంగా వ్యవహరించేలా చూస్తాం. వ్యవసాయ మార్కెట్లకు త్వరలోనే పాలకవర్గాలను ప్రకటిస్తాం.
>
> \- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



- మార్కెట్ కమిటీ చైర్మన్ పీఠం కోసం జోరుగా ప్రయత్నాలు
- పెండింగ్‌లో 7 మార్కెట్ కమిటీల నియామకాలు
- అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు ఆశావహుల పాట్లు

సాక్షి, పెద్దపల్లి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వ్యవసాయ మార్కెట్ కమిటీలను రద్దు చేసింది. ధర్మారం మార్కెట్ కమిటీ మినహా జిల్లాలోని ఏడింటికి పాలకవర్గాలను ఇంకా నియమించలేదు. దీంతో ఆ పదవులపై అధికార పార్టీలో పోటాపోటీ నెలకొంది. స్థానిక ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకుంటూనే మంత్రి ఆశీస్సులతో మార్కెట్ కమిటీ పీఠం దక్కించుకునేలా ఆశావహులు పావులు కదుపుతున్నారు.

జిల్లాలో 8 మార్కెట్ కమిటీలు

- జిల్లాలో పెద్దపల్లి, సుల్తానాబాద్, ధర్మారం, మంథని, జూలపల్లి, కమాన్‌పూర్, కాల్వశ్రీరాంపూర్, రామగుండం వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి.
- వీటిలో ధర్మారం మార్కెట్ కమిటీ పాలకవర్గం రొటేషన్ పద్ధతిలో ఎస్టీకి కేటాయించారు.
- రూప్లా నాయక్‌ను చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్వర్వులు విడుదల చేసింది.
- మిగిలిన వాటికి ఇంకా నియామాకాలు చేపట్టలేదు.
- పాలకవర్గాల్లో చోటుసంపాదించుకునేందుకు మార్కెట్ పరిధిలోని గ్రామానికి చెందిన వ్యక్తి రైతు అయి ఉండాలి.
- అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులతోపాటు పాలకవర్గాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రతిపాదించాల్సి ఉంటుంది.
- పాలకవర్గాలలను రిజర్వేషన్ పద్ధతిన భర్తీ చేసేందుకు ప్రభుత్వం గతంలోనే ఆదేశాలు జారీచేసింది.
- దాని ప్రకారమే ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు పంపించాలి.
- మార్కెట్ల వారీగా పదేళ్ల వరకు ఒకేసారి రిజర్వేషన్లు నిర్ణయించారు.
- అధ్యక్ష పదవీకాలం ఏడాది ఉంటుంది.
- కానీ రిజర్వేషన్ సౌకర్యం రెండేళ్లు ఉంటుంది.
- దీంతో ఒక్కసారి ఎంపికైనవారు మరో ఏడాది వరకు గడువు పొడిగేంచేలా ఉత్తర్వులు తెచ్చుకొని కొనసాగుతారు.
- రెండేళ్లు పూర్తయితే మార్కెట్ స్థానం రిజర్వేషన్ ప్రకారంగా తిరిగి గతంలో నియమించిన అధ్యక్షుడు కొనసాగే అవకాశం ఉండదు.
- ఆయన స్థానంలో రిజర్వేషన్ ప్రకారంగా మరో అభ్యర్థిని నామినేట్ చేయాల్సిందే.
- దీంతో ఆయా మార్కెట్ కమిటీల రిజర్వేషన్ ఆధారంగా, అనుకూలంగా ఉన్న నేతలు పదవిని దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

ఆశావహుల్లో ఉత్సాహం..

- హస్తం పార్టీ కొలువుదీరాక త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించింది.
- ఇందుకు అనుగుణంగానే పలు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసింది.
- రామగుండం నుంచి హర్కర వేణుగోపాల్‌రావుకు ప్రభుత్వ సలహాదారుగా ఇటీవల అవకాశం కల్పించింది.

ఇద్దరి పేర్లు సిఫారసు

పెద్దపల్లి మార్కెట్ కమిటీ(ఎస్సీ)కి ఈర్ల స్వరూప, జూలపల్లికి గుండు సంజీవ్ పేర్లను ప్రతిపాదించినట్లు సమాచారం. మరోవైపు.. సుల్తానాబాద్ మార్కెట్(జనరల్) కిమటీ చైర్మన్ గిరీ కోసం దనమనేని ఆనందరావు, చీటి సతీశ్‌రావు, శ్రీనివాసరావు, దామోదర్‌రావు, మినుపాల ప్రకాశ్‌రావు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. కాల్వశ్రీరాంపూర్(జనరల్) చైర్మన్ సీటు కోసం జిన్నా రామచంద్రరెడ్డి, చదువు రామచంద్రారెడ్డి, గాజనవేన సదయ్య, డొంకెన మొగిలి, ఈద సత్యనారాయణరెడ్డి, రామిడి తిరుపతిరెడ్డి పావులు కదుపుతున్నారు. కమాన్‌పూర్(జనరల్) కుర్చీని గంట వెంకటరమణారెడ్డి, పీట్ల గోపాల్, ఇనగంటి రామరావు, తొట్ల తిరుపతి యాదవ, ఇనుగంటి భాస్కర్‌రావు, కోలేటి మారుతి, నైనాల రాజు ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. రామగుండం మార్కెట్(ఎస్సీ) కమిటీ చైర్మన్ కోసం ఉరిమెట్ల రాజలింగం, వేల్పుల రాజుకుమార్ పోటీపడుతున్నారు. మంథని(జనరల్) నుంచి శశిభూషణ్ కాచె, ఉప్పట్ల శ్రీనివాస్, ముస్కుల సురేందర్‌రెడ్డి, మూల పురుషోత్తంరెడ్డి తదితరులు పదవి ఆశిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీలో చర్చ జరుగుతోంది.

- కానీ, జిల్లాకు ఇప్పటివరకు పెద్దగా ప్రాధాన్యం దక్కలేదు.
- స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్న తరుణంలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తారనే సమాచారంతో ఆశావాహుల్లో ఉత్సాహం నెలకొంది.
- ఎలాగైనా పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.
- సీనియర్లు రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్, మరికొందరు జిల్లాస్థాయి పదవుల కోసం ఎదురుచూస్తున్నారు.
- పదవుల భర్తీకి తీసుకునే ప్రాతిపదికపైనే కాంగ్రెస్ నేతల భవితవ్యం ఆధారపడి ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.
- ఆదినుంచీ పార్టీలో పనిచేస్తున్నవారు, వివిధ పార్టీల నుంచి ఎన్నికల ముందు, ఆ తర్వాత కాంగ్రెస్‌లో పార్టీలో చేరినవారు, వివిధ జేఏసీల్లో క్రియాశీలకంగా పనిచేస్తూ తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన వారు పదవులు దక్కుతాయనే విశ్వాసంతో ఉన్నారు.

ప్రజా'వాణి' వినండి.. సమస్య పరిష్కరించండి

అధికారులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం

పెద్దపల్లిరూరల్: ప్రజావాణి ద్వారా అభాగ్యుల నుంచి అందిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిచ్చి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలపై అందించిన దరఖాస్తులను అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి స్వీకరించారు. అర్జీలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్లు అరుశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్

గుండమ్మ చెరువును కాపాడండి



పెద్దపల్లి సమీప గుండమ్మ చెరువును ఆక్రమించుకుని రియల్టర్లు ప్రహరీ, గేటు నిర్మించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే భూమిని ప్లాట్లుగా మార్చి అమ్ముకునేందుకు యత్నిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకుని గుండమ్మ చెరువును కాపాడాలి.

\- దోనేటి బాలకృష్ణ, చందపల్లి

గ్యాస్ పైసలు పడ్తలేవ్



మాకు కరంటు బిల్లు మాఫీ అయింది. కానీ, గ్యాస్ పైసలు బ్యాంకుల పడ్తలేవ్. ఆఫీసుల చుట్టు తిరిగినా ఎవలూ పట్టించుకుంటలేరు. రాయితీ అందేలా చూడాలి. - నాయిని జమున, హన్మంతునిపేట

పాసుబుక్కు ఇప్పించుండ్రి



అంతర్గాంలోని సర్వే నంబరు 320లో ప్రభుత్వం మాకు ఎకరం భూమి ఇచ్చింది. అందులో పంటలు పండించుకుంటున్న. ఆన్‌లైన్‌లో నమోదు కోసం తహసీల్దార్ ఆఫీసు చుట్టూ తిరిగిన. ఆన్‌లైన్‌లో పేరు ఎక్కించి కొత్త పాసుబుక్కు ఇప్పించుండ్రి.

\- మామిడి నర్సయ్య, అంతర్గాం

పింఛన్ మంజూరు చేయాలి



మా ఆయన రెండేళ్ల కింద చనిపోయిండు. కూలీ పని చేసుకుంటేనే పూట గడుస్తది. ఏ ఆధారం లేదు. వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న. ఇప్పటికీ మంజూరు కాలే. నాకు పింఛన్ ఇప్పించి ఆదుకోవాలె. - ఒల్లెపు స్వరూప, అంతర్గాం

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, యుగేందర్, స్వామి, రాజేశ్, బాలరాజు, శ్రీనివాస్ తదితరులు

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. భారీవర్షాల నేపథ్యంలో ప్రజల విజ్ఞప్తి మేరకు సోమవారం జనగామ గ్రామాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సమస్యల గురించి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్పొరేషన్ తరఫున పారిశుధ్య పనులు చేపట్టాలని అన్నారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే స్థానిక ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో చికిత్స తీసుకోవాలని కోరారు. పెండింగ్ పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బల్దియా అధికారులతో వివిధ పనులపై సమీక్షించారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. కమిషనర్ శ్రీకాంత్, నాయకులు బొంతల రాజేశ్, తిప్పారపు శ్రీనివాస్, పెద్దెల్లి ప్రకాశ్, యుగేందర్, కొప్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంప్ కార్యాలయంలో వేడుకలు

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుని వద్ద ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్-మనాలీ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిమజ్జనం ర్యాలీ ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి నృత్యం చేశారు. డ్రమ్స్ వాయించి పార్టీ శ్రేణులను ఉత్సాహ పరిచారు. డప్పుచప్పుళ్లు, ఒగ్గుడోలు కళాకారుల నృత్యాల మధ్య వినాయకుని విగ్రహాన్ని గోదావరినది వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి నదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, దీటి బాలరాజు, తిప్పారపు శ్రీనివాస్, పెద్దెల్లి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ ఆశయాలు అనుసరణీయం



కాళోజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్

- అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: సమాజంలో రాజకీయ, సామాజిక చైతన్యం రగిలించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయాలు అనుసరణీయమని అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం క్రీడా, యువజన శాఖ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ జయంతి నిర్వహించారు. కాళోజీ చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా స్పందించే వ్యక్తిత్వం కాళోజీది అని గుర్తుచేశారు. నిజాం సర్కారుకు వ్యతిరేకంగా విద్యార్థిదశ నుంచే పోరాటం సాగించిన నాయకుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నంది పురస్కారానికి ఎంపిక

మంథని: స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల తెలుగు లెక్చరర్, కవి, రచయిత ఓర్సు రాయలింగుకు విద్యాబోధన.. సాహిత్య సేవా రంగాల్లో చేస్తున్న కృషికి కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అవార్డుకు ఎంపిక చేశాయి. ఈమేరకు సంస్థ జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ సోమవారం ఒక పకటనలో తెలిపారు. కాళోజీ నారాయణరావు, గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు బాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 15న విజయవాడలో నంది పురస్కారం అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన చేశారు. స్థానిక అమర్‌చంద్ కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, సభ్యత్వ నమోదు ప్రభారి అరుముల్ల పోచం హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

అర్హులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



ఇళ్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల(పెద్దపల్లి): అర్హులైన వారందరికీ డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు అందిస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఓదెల మండలం కొలనూర్‌లో రోడ్ల విస్తరణ, ఓదెలలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లను సోమవారం ఆయన పరిశీలించారు. బాయమ్మపల్లెలో గణేశ్ మండపం వద్ద పూజలు చేశారు. గుంపులలో అన్నదానం చేశారు. అసంపూర్తి డబుల్‌బెడ్రూమ్ ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తిచేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో రోడ్ల విస్తరణతో ప్రయాణం మెరుగుపడుతుందని తెలిపారు. పల్లెలు అభివృద్ధి చెందుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఓదెలలో రుణమాఫీ కాని రైతుల రేషన్‌కార్డులు, దరఖాస్తులు పరిశీలించారు. పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, బీజేపీ నాయకుడు కర్ర సంజీవరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చీకట్ల మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: సింగరేణికి రావాల్సిన విద్యుత్, బొగ్గు బకాయిలను రాష్ట్రప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆర్జీ-2 ఏరియా ఓసీపీ-3 బేస్‌వర్క్‌షాప్‌లో సోమవారం ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బదిలీ వర్కర్, జనరల్ మజ్దూర్‌ల డిజిగ్నేషన్ వెంటనే మార్పు చేసి, గౌరవప్రదంగా ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గట్టు శ్రీనివాస్, వేణుగోపాల్‌రావు, మాదాసి రవీందర్, రౌతు రమేశ్, నూతి శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

మెరుగైన వైద్యసేవలు అందించాలి

రామగిరి(మంథని): కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఓసీపీ-2లో డివిజన్ ఉపాధ్యక్షుడు ఆర్కాల ప్రసాద్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు.

గోదావరి తీరంలో శవజాగరణ

13.30 గంటల పాటు జోరువానలోనే మృతదేహం

- కుమారుడి భవితవ్యం, ఆస్తిలో వాటా కోసం భార్య ఆందోళన
- నిలిచిన అంత్యక్రియలు.. పోలీసులు, స్థానికుల జోక్యంతో సమసిన వివాదం





గోదావరి నదీతీరంలో సునీల్ మృతదేహం ఉంచిన పెట్టె, దహన సంస్కారాల కోసం నది ఒడ్డున నిరీక్షిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు

మంథని: ఒకవైపు జోరువాన.. ఈదురుగాలులు.. చిమ్మచీకటి.. మరోవైపు.. చలిలో వణుకుతూ, అయిన వాడిని పోగొట్టుకున్న కుటుంబ సభ్యులు.. పుట్టెడు దుఃఖంలో భార్య, ఏం జరిగిందో తెలియని బాబు.. ఇంకోవైపు దహన సంస్కారాలకు ఎదురుచూస్తున్న యువకుడి మృతదేహం.. హృదయాలను ద్రవింపజేసిన ఈ ఘటన సుమారు 13.30గంటల పాటు స్థానికులను వేదనకు, ఆందోళనకు గురిచేసింది. మృతుడి కుటుంబసభ్యులు, భార్య కథనం ప్రకారం.. విలోచవరం గ్రామానికి చెందిన గొట్టె సునీల్(25)కు హైదరాబాద్‌కు చెందిన సంధ్యతో 2020లో వివాహమైంది. 2021లో వీరికి బాబు జన్మించాడు. పెళ్లయినప్పట్నుంచే కుటుంబంలో గొడవలు ఆరంభమయ్యాయి. కొన్నేళ్లక్రితమే సునీల్, సంధ్య తమ కుటుంబసభ్యులతో కలిసి ఉపాధి వెతుక్కుంటూ హైదరాబాద్ చేరుకున్నారు. అక్కడే ఏదో ఓ పనిచేసుకుంటూ బతుకుతున్నారు. ఈక్రమంలో సునీల్ అనారోగ్యం బారినపడి అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. కుటుంబసభ్యులు మృతదేహాన్ని మంథనికి తీసుకొస్తున్నారు. అయితే, తను, తన కుమారుడు లేకుండా తన భర్త మృతదేహాన్ని ఎలా తీసుకెళ్తున్నారని సంధ్య ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతేకాదు.. అత్త, బావతోపాటు మరోవ్యక్తిపై హైదరాబాద్ అల్వాల్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. దీంతో ఆదివారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో మంథని సమీపంలోని గోదావరి నది వద్దకు మృతదేహాన్ని తీసుకొచ్చారు. దహన సంస్కారాలకు ఏర్పాట్లు చేస్తుండగా తన కుమాడికి ఆధారం చూపాలని సంధ్య.. అంత్యక్రియ అడ్డుకుందని మృతుడి సోదరుడు సుమన్ తెలిపారు. తనకు వివాహమైన మరుసటి రోజు నుంచే కుటుంబంలో గొడవలు, పంచాయితీలు, పోలీసు కేసులతో బాధపడుతూ ఉన్నామని సంధ్య కన్నీటి పర్యంతమైంది. ఇంతటి ఇబ్బందులతోనూ కుటుంబాన్ని నెట్టుకొచ్చానని, తన జీవితం ఎలాగూ స్పాయిల్ అయిందని, తన కుమారుడికైనా న్యాయం చేయాలని విన్నవించింది. స్థానికులు, పోలీసులు జోక్యం చేసుకొని ఆమెకు నచ్చజెప్పడంతో సోమవారం ఉదయం 11 గంటల తర్వాత దహన సంస్కారాలు జరిగాయి. భార్యాభర్తల మధ్య వివాదంతో సుమారు ఏడాదిగా వేర్వేరుగా ఉంటున్నారు. సునీల్ కుటుంబం సైతం స్వగ్రామం వదిలి బతుకుదెరువు కోసం గతంలోనే హైదరాబాద్ వెళ్లాడు.

క్లుప్తంగా

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య


మల్లేశం(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): నందిమేడారం గ్రామానికి చెందిన గోనె మల్లేశం(45) జీవితంపై విరక్తి చెంది సోమవారం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. మల్లేశం రెండేళ్లుగా కడుపు నొప్పితో పాటు ఇతర శారీరక సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయంకాలేదు. మానసికంగా కుంగి, జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం దాదాపు 5 గంటల సమయంలో తన ఇంట్లోని రేకుల షెడ్ ఇనుపరాడ్‌కు టవల్‌తో ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు.

భక్తుల ముసుగులో దొంగలు

- వినాయక విగ్రహంపై కరెన్సీ మాల అపహరణ

తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్ పంచాయతీ పరిధి ఎల్ఎండీ కాలనీ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల ముసుగులో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాన్ని భక్తులు కరెన్సీ మాలతో అలంకరించారు. దీన్ని గమనించిన దొంగలు ఆదివారం రాత్రి కరెన్సీమాలతోపాటు మండపంలో ఉన్న నగదును సైతం అపహరించారు. అనంతరం హుండీ పగలగొట్టేందుకు విఫలయత్నం చేశారు. అక్కడి నుంచి పక్కనే ఉన్న శివాలయంకు వెళ్లి అక్కడ ఏమీ లభించకపోవడంతో వినాయక విగ్రహం రాగి తొండంను ఎత్తుకెళ్లారు. అమ్మవారి బంగారు నగలు అనుకొని తీసుకెళ్లారు. మూడు రోజుల క్రితం తాపాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని హనుమాన్ ఆలయం హుండీలోని నగదు దొంగిలించినట్లు తెలిసింది. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి


సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

ధర్మారం(ధర్మపురి): ఉపాధ్యాయ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించి, పీఆర్సీ అమలు చేయాలని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ముసుకుల సునీల్‌రెడ్డి డిమాండ్ చేశారు. వివిధ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదును సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ గత ఎన్నికలకు ముందు ఇచ్చినమాట ప్రకారంగా మూడు డీఏలు మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆయన కోరారు. ఇందుకోసం విద్యాశాఖ అధికారులు స్పందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల బాధ్యులు నూతి మల్లయ్య, గడ్డం దశరథరెడ్డి, జిల్లా నాయకుడు వనపర్తి అంజయ్య, ప్రధానోపాధ్యాయులు నరేందర్‌రావు, చెన్నారెడ్డి, తిరుపతి, రజనీప్రియదర్శిని, రామన్ పద్మజా, ప్రకాశ్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘108’లో జన్మించిన శిశువులు

- ఆస్పత్రులకు తరలిస్తుండగా పురిటినొప్పులు అధికం
- మార్గమధ్యంలోనే పురుడుపోసిన అంబులెన్స్ సిబ్బంది
- సమయస్ఫూర్తితో స్పందించడంతో సంపూర్ణ ఆరోగ్యంగా తల్లీబిడ్డలు
- సిబ్బందిని అభినందించిన కుటుంబసభ్యులు, అధికారులు, వైద్యులు


తల్లీబిడ్డ కలవేని శారదతో 108 వాహన సిబ్బంది, కుటుంబసభ్యులు, ఆశ వర్కర్


పండంటి పాపతో 108 సిబ్బంది, తల్లి సౌజన్య

జిల్లాలోని 108 అంబులెన్స్ సిబ్బంది సమయస్ఫూర్తితో, అప్రమత్తంగా వ్యవహరించారు. పురిటి నొప్పులతో బాధపడుతున్న ఇద్దరు గర్భిణులను ఆస్పత్రులకు తరలిస్తుండగానే నొప్పులు అధికం కావడంతో మార్గమధ్యంలోనే పురుడు పోశారు. తల్లీబిడ్డలను కుటుంబసభ్యులకు క్షేమంగా అప్పగించి ఆ తర్వాత ఆస్పత్రుల్లో చేర్పించారు. వారిని పలువురు అభినందించారు.

పెద్దపల్లిరూరల్: తుర్కలమద్దికుంట గ్రామానికి చెందిన కలవేన శారద సోమవారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబసభ్యులు 108 సిబ్బందికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వాహనంతో గ్రామానికి చేరుకున్న సిబ్బంది ఆమెను తీసుకుని పెద్దపల్లి మాతాశిశు ఆస్పత్రికి బయలు దేరారు. అయితే, మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువకావడంతో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నిమ్మతి శ్రీనివాస్, పైలట్ హబీబ్ సహకారంతో కాల్‌సెంటర్ వైద్యుడి సూచన మేరకు సుఖప్రసవం చేశారు. పండంటి ఆడశిశువుకు శారద జన్మనివ్వగా తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. వారిని మాతాశిశు ఆస్పత్రిలో చేర్పించారు. సకాలంలో పురుడుపోసిన 108 సిబ్బందికి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వైద్యులు అభినందించారు.

పందిల్లలో..

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పందిల్ల గ్రామానికి చెందిన బండి సౌజన్య(26) పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆశవర్కర్ వరలక్ష్మికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆమె ఇచ్చిన సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది కాల్వశ్రీరాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకున్నారు. అప్పటికే పీహెచ్‌సీకి తీసుకొచ్చిన సౌజన్యను అక్కడి నుంచి 108 వాహనంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికమయ్యాయి. దీంతో కూనారం సమీపంలో అంబులెన్స్ రోడ్డు పక్కన నిలిపివేశారు. ఆశ వర్కర్ సాయంతో ఈఎంటీ బాలు, పైలెట్ మదన్ సౌజన్యకు పురుడు పోశారు. ఆడశిశువు జన్మించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, పాప మూడు కిలోలు బరువు ఉందని పైలెట్ మధు తెలిపారు. ఆడశిశువుకు జన్మనిచ్చిన సౌజన్య చేతులు జోడించి 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది. ఆమె కుటుంబసభ్యులు, బంధువులు అంబులెన్స్ సిబ్బందిని అభినందించారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించండి

- ఆదివాసీ బిడ్డ సీతక్క స్పందించకపోవడం శోచనీయం
- సీపీయూ(ఎస్ఐ) దళిత బహుజన శ్రామిక విముక్తి రాష్ట్ర నేత రమేశ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): భద్రాది కొత్తగూడెం జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని సీపీయూ(ఎస్ఐ) దళిత బహుజన శ్రామిక విముక్తి రాష్ట్ర సహాయ కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. విప్లవ ద్రోహి ఇచ్చిన సమాచారంతో దళం సేదతీరుతున్న సమయంలో ఏకపక్షంగా కాల్పులు జరిపి, ఎన్‌కౌంటర్ అని కట్టుకథ అల్లుతున్నారని ఆయన ఆరోపించారు. ఈమేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం ఉమ్మడి జిల్లాలోని ఖనిజ సంపదను బహుళ జాతి సంస్థలకు అప్పగించేందుకు బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని, ఇందులో భాగంగానే ఎన్‌కౌంటర్ జరిగిందని ధ్వజమెత్తారు.

వరద బాధితులకు పరామర్శ పేరిట..

ఎన్‌కౌంటర్లు, రాజ్యహింస లేని తెలంగాణ కావాలని సాధించుకున్న రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నిరుద్యోగ సమస్య పరిష్కరించలేకపోయిందని రమేశ్ ఆరోపించారు. ప్రాజెక్టుల పేరిట రూ.లక్షల కోట్లు కొల్లగొట్టిందని ఆరోపించారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తన 9 నెలల పాలనలోనే గ్రేహౌండ్స్ పోలీసులతో నక్సల్స్ ఏరివేత లక్ష్యంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. వరద బాధితుల పరామర్శ పేరిట ఖమ్మం జిల్లాలో తిష్ట వేసి నక్సల్స్ ఏరివేతను ఎజెండాగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆదివాసీ బిడ్డ, మంత్రి సీతక్క స్పందించరేం?

జల్, జంగిల్, జమీన్ కోసం పోరాడుతున్న మావోయిస్టు పార్టీలని ఆదివాసీలను ఎన్‌కౌంటర్ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం చంపుతున్నా చేస్తున్నా నక్సలైట్ ఎజెండానే తమ ఎజెండా అని చెబుతున్న ఆదివాసీ బిడ్డ, మంత్రి సీతక్క నోరు విప్పకపోవడం శోచనీయమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్‌కౌంటర్ ప్రాంతాలకు వెళ్లి, మృతుల అంత్యక్రియలు జరిపించి, శాసనసభలో ఎన్‌కౌంటర్‌పై ఆగ్రహించి, ఏడ్చిన సీతక్క మంత్రి పదవి దక్కిన తర్వాత ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. భద్రాద్రి కొత్తగూడెం ఎన్‌కౌంటర్‌కు బాధ్యత వహిస్తూ మంత్రి సీతక్క తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థులు, కవులు ఎన్‌కౌంటర్లు, అక్రమ అరెస్టులు లేనిరాష్ట్రం కోసంం పోరాడాలని ఆయన కోరారు.

చేతివృత్తుల వారి ఉపాధి కోసమే ‘పీఎం విశ్వకర్మ’

- అడిషనల్ డైరెక్టర్ దశరథం

పెద్దపల్లిరూరల్: చేతివృత్తులపై ఆధారపడి ఆర్థికంగా వెనుకబడిన వారికి అండగా నిలిచి ఆర్థికాభ్యున్నతి సాధించేలా ప్రోత్సహించేందుకే కేంద్ర ప్రభుత్వం ‘పీఎం విశ్వకర్మ యోజన పథకం’ అమలు చేస్తోందని ఎంఎస్ఎంఈ అడిషనల్ డైరెక్టర్ దశరథం అన్నారు. స్థానిక అమర్‌చంద్ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మధుసూదనాచారితో కలిసి ఆయన పాల్గొన్నారు. 18 కులాలకు చెందిన వారికి ఈ పథకంలో అవకాశం కల్పించారని తెలిపారు. ఆసక్తిగలవారికి తొలి విడతలో రూ.లక్ష, మలివిడతలో రూ.2లక్షలు అందిస్తారని వివరించారు. పథకం కింద ఎంపికైన వారికి ఐదు రోజుల పాటు శిక్షణ ఇస్తారని, ఆ సమయంలో రోజూ రూ.500 చొప్పున సాయం అందిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో ప్రతినిధులు మస్తాన్‌ఖాన్, బొడ్డుపల్లి శ్రీనివాస్, బూతగడ్డ సంపత్, తాడూరి శ్రీమాన్, బీమోజు సురేందర్, జగదీశ్, అశోక్, పవన్, రాజు పాల్గొన్నారు.

స్కూళ్లలో తెలంగాణ భాషా దినోత్సవం


కాళోజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి, విద్యార్థులు


బిర్లా స్కూల్లో ప్రిన్సిపాల్, టీచర్లు, విద్యార్థులు..

కొత్తపల్లి(కరీంనగర్): ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా సోమవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి నివాళి అర్పించారు. తెలంగాణ యాసకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే కాకుండా రాష్ట్ర సాధనకు తన రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారని కొనియాడారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో సోమవారం తెలంగాణ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. విద్యార్థులు కాళోజీని స్మరించుకుంటూ పాటలు, ఆటలతో అలరించారు. కాళోజీ తెలంగాణ భాష, యాసకు గుర్తింపు తీసుకువచ్చారని చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బబిత విశ్వనాథన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ యాసకు చిరునామా ‘నలిమెల’


భాస్కర్‌ను సన్మానిస్తున్న మధుసూదన్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్: కాళోజీ సాహితీ పురస్కారానికి ఎంపికైన కరీంనగర్ ముద్దుబిడ్డ, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్ తెలంగాణ భాష, యాసకు చిరునామా అని తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం, లీడ్ ఇండియా నేషనల్ క్లబ్ అధ్యక్షుడు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి కొనియాడారు. సోమవారం ఆయనను కరీంనగర్‌లో సత్కరించారు. నలిమెల మాట్లాడుతూ.. తన అభిరుచికి తగినట్లుగా సాహిత్య కృషి చేశానని, ఏ అవార్డు లేదా పురస్కారం కోసం పని చేయలేదన్నారు. కాళోజీ పురస్కారానికి తాను ఎంపికవడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. సంఘం కార్యదర్శి, కవి బొమ్మకంటి కిషన్, కార్యవర్గ సభ్యురాలు, కవయిత్రి అనిత, సభ్యులు తుమ్మల రమేశ్ రెడ్డి, ఎం.మహేందర్, పి.సురేందర్ ఉన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు


సత్యనారాయణ

కరీంనగర్: మంథని మున్సిపల్ పరిధిలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇనుముల సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ సోమవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన మందల మల్లారెడ్డికి 302 గజాల ఇంటి స్థలం ఉంది. మున్సిపల్ నుంచి అనుమతి పొంది అందులో ఇంటి నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఇనుముల సత్యనారాయణ తనకు రూ.5లక్షలు మామూలు ఇవ్వాలని, లేకుంటే నిర్మాణాన్ని అడ్డుకుంటానని యజమానిని బెదిరించారు. అంతేకాదు.. మున్సిపల్ అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేశారు. బాధితుడు ఇటీవల హైకోర్టును ఆశ్రయించి నిర్మాణానికి ఆటంకాలు లేకుండా ఉత్తర్వులు పొందారు. అయితే, సత్యనారాయణ గన్‌మెన్‌తో వచ్చి డబ్బులు ఇవ్వకపోతే.. ఇంటిని కూల్చివేయిస్తానని, గతంలో హైకోర్టులో పిల్ వేసి చాలా ఇళ్లు కూల్చివేయించానని బెదించారు. ఈక్రమంలో గత ఆగస్టు 20న బాధితుడు రూ.రెండు లక్షలు చెల్లించారు. మిగతా సొమ్ము కోసం సత్యనారాయణ బెదిరిస్తున్నారు. గతంలోనూ ఇలా అనేక మందిని ఇబ్బందులకు గురిచేసి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేశారని, బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

గోడ తడిచి చిన్నారికి విద్యుత్‌షాక్

- కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూంలో ఘటన
- తల్లిదండ్రుల అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి లాస్య

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని కేసీఆర్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో సోమవారం ఓ చిన్నారి విద్యుత్‌షాక్‌కు గురికాగా ప్రాణాపాయం తప్పింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. కేసీఆర్‌నగర్ బ్లాక్ నంబర్ 90లో నివసిస్తున్న కొలిపాక రాము–రూప దంపతులకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద కూతురు ఏడేళ్ల వయసున్న లాస్య సోమవారం ఉదయం స్కూల్‌కు వెళ్లేందుకు తయారై ఇంటి ఆవరణలో గోడపక్కన విడిచిన చెప్పులు వేసుకునేందుకు గోడను ముట్టుకుంది. అదే గోడకు కరెంటు మీటర్లు అమర్చి ఉండడం.. ఇటీవల కురిసిన వర్షాలకు తడిచిపోవడంతో చిన్నారి విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన సమీపంలో ఉన్న మమత అనే మహిళ పాపను రక్షించేందుకు ప్రయత్నించగా ఆమె సైతం విద్యుత్‌షాక్‌కు గురైంది. ఇద్దరిని రక్షించేందుకు వచ్చిన చిన్నారి తల్లి రూపకు కూడా షాక్ రావడంతో సమయస్ఫూర్తితో వ్యవహరించి కర్ర సాయంతో చిన్నారిని పక్కకులాగి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం ఏమి లేదని వైద్యులు తెలపడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

‘జ్యోతిష్మతి’లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేఎస్.రావు

తిమ్మాపూర్(మానకొండూర్): మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(అటానమస్) కళాశాలలో సోమవారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2024 ఉత్సాహంగా నిర్వహించారు. ఈ హ్యాకథాన్ దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న కొన్ని ముఖ్యమైన సమస్యలను పరిష్కరించేందుకు విద్యార్థులకు ఒక వేదికగా ఉపయోగపడుతుందని కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్ రావు అన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల మధ్య పోటీతత్వాన్ని పెంచడమే కాకుండా వారి ప్రతిభను వెలికితీసి, నూతన ఆవిష్కరణలకు కారణమైందని పేర్కొన్నారు. ఇందులో పాల్గొన్న 60 జట్లలో 45కు పైగా తర్వాతి రౌండ్‌కు చేరుకున్నాయని తెలిపారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ కేఎస్.రావు, డీన్ అకాడమిక్స్ పీకే వైశాలి, కన్వీనర్ అండ్ పీవోసీ ఎస్.వెంకటేశ్వరన్, కో–ఆర్డినేటర్ ఎం.మణికండన్, అధ్యాపకులు, దాదాపు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ రెస్క్యూ పోటీలకు ‘సింగరేణి’

- నేడు కొలంబియాకు బయలు దేరి వెళ్లనున్న జట్టు
- పోటీల్లో పాల్గొనడం ఇది ఏడోసారి


అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో పాల్గొంటున్న సింగరేణి జట్టు

గోదావరిఖని: సుమారు నెలన్నర రోజుల పాటు కఠోర సాధన తర్వాత సింగరేణి రెస్క్యూ జట్టు అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో పాల్గొనేందుకు మంగళవారం బయలు దేరి కొలంబియా దేశం వెళ్లనుంది. ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు కొలింబియా దేశంలో పోటీలు జరగనున్నాయి. అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో సింగరేణి సంస్థ 2006 నుంచి ప్రాతినిధ్యం వహిస్తోంది. ప్రస్తుత పోటీల్లో 23 దేశాల పట్టు పాల్గొంటున్నాయి. సింగరేణి సంస్థ జట్టు పోటీల్లో పాల్గొనడం ఇది ఏడోసారి. మనదేశం నుంచి సింగరేణి, వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్, హిందుస్థాన్ జింక్ సంస్థల జట్లు పోటీలకు హాజరవుతాయి. హెచ్‌సీఎల్ నుంచి మహిళా జట్టు పాల్గొంటోంది. సింగరేణి డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీం మేనేజర్‌గా బింగి మాధవరావు వ్యవహరించనున్నారు. ఇందులో 9మంది సభ్యులు ఉంటారు. ఈ జట్టు రెస్క్యూ రికవరీ, ఫైర్ ఫైటింగ్, రోప్‌రెస్క్యూ, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ స్కిల్స్ విభాగాల్లో తర్ఫీదు పొందింది. జట్టు మంచి ప్రతిభ కనబర్చి సంస్థ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలపాలని రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

విదేశీ విద్య స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఎస్సీ విద్యార్థుల కోసం 2024–25 సంవత్సరానికి గానూ ప్రవేశపెట్టిన జాతీయ విదేశీ విద్య ఉపకార వేతనానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి ఎం.నాగైలేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంతో విదేశాల్లో పీజీ, పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం ఉంటుందని, జిల్లా నుంచి 125 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. www.nosmsje.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థుల వయసు ఏప్రిల్ 1 నాటికి 35 ఏళ్లు మించకూడదని, తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ.8 లక్షల్లోపు ఉండాలని తెలిపారు. డిగ్రీలో 60 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని, ఒక కుటుంబం నుంచి మొదటిసారి ఒకరికి మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సంవత్సరంలో ఖాళీలు ఉంటే రెండో విద్యార్థికి అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఏడాదికి రెండుసార్లు చాన్స్ ఉంటుందన్నారు. మొదట ఫిబ్రవరి నుంచి 45 రోజులు, తర్వాత సెప్టెంబర్ 1 నుంచి 45 రోజులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఉపసంచాలకులు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖను 97040 11827 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

తంసా రాజన్న జోన్ అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్


నియామక పత్రాలతో కార్యవర్గం

కరీంనగర్ అర్బన్: తెలంగాణ పశుసంవర్ధక శాఖ మినిస్టీరియల్ సర్వీస్ అసోసియేషన్ రాజన్న జోన్–3 అధ్యక్షుడిగా జి.రాజేంద్ర ప్రసాద్(ఎఫ్ఎస్‌బీఎస్,కరీంనగర్)ను నియమించినట్లు ఎన్నికల అధికారి యం.జగన్ వెల్లడించారు. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాలతో రాజన్న జోన్ ఉండగా సదరు జోన్ ప్రకారం నూతనంగా ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. మూడేళ్ల పాటు పాలకవర్గం ఉంటుందని వివరించారు. ఉపాధ్యక్షుడిగా జి.అంబరీశ్(కామారెడ్డి), కార్యదర్శిగా ఎ.హైమావతి(కరీంనగర్), సంయుక్త కార్యదర్శులుగా పి.శ్రీనివాస్(రాజన్న సిరిసిల్ల), పి.శ్రీలత(కామారెడ్డి), కోశాధికారిగా జి.మధు(సిద్దిపేట), ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఈ.కాంత, కార్యవర్గ సభ్యులుగా ఎండీ.అజారుద్దీన్(మెదక్), టి.రమేశ్(రాజన్న సిరిసిల్ల), బి.వాణి(సిద్దిపేట)లను నియమించినట్లు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని తంసా రాష్ట్ర నేతలు గూడ ప్రభాకర్‌రెడ్డి, టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డిలు అభినందించారు.

‘ఈ వంట మనుషులు మాకొద్దు’


విద్యార్థులను తీసుకెళ్తున్న తల్లిదండ్రులు

ధర్మపురి: ‘మధ్యాహ్న భోజనం రుచిగా లేదు.. ఈ వంట మనుషులు మాకొద్దు’ అంటూ విద్యార్థులు పాఠశాల నుంచి వెళ్లిపోయిన ఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం ఆరెపెల్లి ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. వివరాలు.. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతులు నిర్వహిస్తున్నారు. హెచ్‌ఎం మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 55 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే, గత రెండేళ్ల నుంచి మధ్యాహ్న భోజనం సరిగా వండడం లేదని, పురుగుల అన్నం, నీళ్ల సాంబారు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని నిర్వాహకులను ఇటీవల పక్కన పెట్టారు. అయినా సదరు నిర్వాహకులు సోమవారం పాఠశాలకు వచ్చి ఇబ్బందులకు గురి చేయడంతో తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్లారు. ఈక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య వాగ్వాదం జరిగింది. వండిన మధ్యాహ్న భోజనం వృథాగా పడేశారు. కాగా, పాత వంట మనుషులు పసుపు, బియ్యం కలిపి పాఠశాల చుట్టూ పోయడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారని తల్లిదండ్రులు వాపోయారు.

సగం ధరకే ఇసుక అంటూ మోసం

- డబ్బులు ఫోన్ పే చేయించుకున్న గుర్తు తెలియని వ్యక్తులు
- మల్లన్నపల్లిలో ఘటన

వీణవంక(హుజూరాబాద్): డీజిల్ లేక ట్రాక్టర్ మధ్యలో ఆగిపోయింది.. డీజిల్‌కి డబ్బులిస్తే సగం ధరకే ఇసుక తెచ్చిపోస్తాం.. పోలీసులు నిఘా పెంచిండ్రు.. అసలే ఇసుక దొరుకుతలేదంటూ అమాయక ప్రజలను నమ్మించి, డబ్బులు దండుకున్న ఘటన వీణవంక మండలంలోని మల్లన్నపల్లి గ్రామంలో చోటుచేసుకొంది. బాధితుడి వివరాల ప్రకారం.. మల్లన్నపల్లికి చెందిన ఓ వ్యక్తి ఇంటికి మూడు రోజుల క్రితం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారు. మాది కోర్కల్ గ్రామమని, మా ఇసుక ట్రాక్టర్ డీజిల్ లేక మధ్యలో ఆగిపోయిందని నమ్మబలికారు. పోలీసోళ్లు చూస్తే ట్రాక్టర్‌ను పట్టుకుంటారని, రూ.4 వేలు ట్రిప్పు ఉన్న ఇసుక రూ.2 వేలకే పోస్తమని నమ్మించారు. దీంతో సదరు వ్యక్తి డబ్బులు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. క్యాష్ లేదని చెప్పడంతో నిందితులు ఓ ఫోన్ నంబర్ ఇవ్వగా రూ.2 వేలు ఫోన్ పే చేశాడు.

ఇసుక తీసుకురాకపోవడంతో..

రెండు రోజులు గడిచినా ఇసుక తీసుకురాకపోవడంతో అనుమానం వచ్చిన బాధిత వ్యక్తి విషయాన్ని సోమవారం గ్రామస్తులకు చెప్పాడు. ఫోన్ పే చేసిన నంబర్‌కు ఫోన్ చేసి, అడుగగా అది ఘన్ముక్కుల గ్రామంలోని ఓ కిరాణా దుకాణానికి సంబంధించినదని తేలింది. ఎంతోమంది ఫోన్ పే చేయించి, సరుకులు తీసుకుపోతారని దుకాణదారుడు తెలుపడంతో సదరు వ్యక్తి లబోదిబోమన్నాడు. గ్రామస్తులు నిందితుల కోసం ఆరా తీశారు. ఆ ఇద్దరిది కోర్కల్ గ్రామం కాదని భావిస్తున్నారు. వీణవంక, రెడ్డిపల్లిల్లోనూ ఇదే తరహాలో బురిడీ కొట్టించి, డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికైనా పోలీసులు నిఘా పెంచాలని మండల ప్రజలు కోరుతున్నారు.